కథానిక

# నాలుగు స్తంభాలాట

వి. యస్. అవధాని

ఎంత కాదనట్లే కాచి చిటపటలాడి వాన ప్రారంభమయింది. శేషు అంతవరదాకా రాస్తున్నకలం ఆపలేదు. పది గంటలకు ఇంటిదగ్గరనుంచి వచ్చి ఈ బ్యాంకులో పడ్డాడు. అది ఆఖరు నెలలో ఆఖరు రోజు. ఆనాడే జీతం ఇస్తారు. కాని ఇది ఏం జీతం? తన ఖర్చులలో ఎన్నోవంతు? అంతకన్న ఎక్కువ సంపాయించ డానికి వీల్లా కనిపించదు. ఇవన్నీ ఆలోచించేందుకు తీరిక ఏదీ? ఒకటే పని- పని- దేనికీ ఈ పనంతా? దీని వలన తనకు ఏం లాభం?

వాన కురుస్తూనే ఉన్నది. టైపిస్టు మిషన్లు టక టక లాడిస్తున్నారు. వాళ్ళు ఇద్దరిలో ఎవరు యంత్రం? ఎవరు మనిషి? గడియారం తిరిగి తిరిగి అయిదు కొట్టింది. ఏజంటు కారు పోతూ పోతూ భాగ్యవంతుని ఉదీర్ఘపు శ్రేష్ఠల్లే ఒక అరుపు అరచి పోయింది. ఒక్కొక్కరే లేచి పోతున్నారు. కాని శేషు లేవలేదు. ఇంకా రాస్తూనే ఉన్నాడు. అలాగని కష్టపడి పని చేసేవాడని మెప్పు సంపాదించేందుకా? కాదు. ఆలోచనల తీవ్రతవల్ల ఎక్కువైన ఆయాసం వలన ఇంకా అట్లా ఎంతసేపయినా కూర్చునే వాడేమో- ఇంతలో "కాషియర్ గారు పిలుస్తున్నారండీ" అన్నాడు ప్యూను రాఘవయ్య.

నిద్రలోంచి లేచిన వాడల్లే శేషు రాఘవయ్య వంక ఎగాదిగా చూశాడు. తను చేస్తున్న ఏ రహస్యపు పనినయినా వాడు పసికట్టాడేమో ననే ఓ రకపు అనుమానంతో. మళ్ళీ రాఘవయ్య "మిమ్మల్ని కాషియర్ గారు....."

"ఆ, వస్తున్నా" అంటూ తన జీతపురాళ్ల న రూపాయిలు పుచ్చుకున్నాడు. దరిద్రుని కోపా లాగిట్టే వాన కొంచెం వెలిసింది.

శేషు పాటు సర్దుకుంటూ మెల్లిగా వరండా లోంచి బయటికి నడుస్తున్నాడు. బియ్యపుకొమటి వెంకయ్య యముడల్లే ఎదురుగా వస్తున్నాడు.

"...ఈ నెలన్నా పైకం ఇప్పించాలి. రెండు నెలలనుంచీ వాయిదా..............."

"ఏదీ పుస్తకం ఇటు తే..."

ఎప్పుడూ తనవెంబడే ఉండే దండాయుధం లాంటి చిట్టాను వెంకయ్య తీస్తూ-

"చిత్తం...ఇదుగో తమ ఖాతా 52 రూపాయిలు ఇవ్వాలి."

యాభయి రూపాయిలు జమవేసి అయిదు పదులు ఇచ్చి గబగబా బయటికి నడుస్తున్నాడు.

ఎదుటనే ఉన్న కాంటీన్ కుర్రవాడు... "మిమ్మల్ని అయ్యరుగారు పిలుస్తున్నారండీ" అన్నాడు.

"రేపు ప్రొద్దున వస్తానని చెప్పు."

"అట్లా కాదటండీ, ఇప్పుడే రమ్మన్నారండీ."

తప్పదు కనుక హోటల్లోకి వెళ్లి తనే ముందుగా "ఇదిగో, ఈ ముప్పయి జమ వేసుకో" అన్నాడు. అట్లా అనడం ఎంత దర్జా! కాని ఆ దర్జా ఎంతసేపు ఉంటుంది? క్షణం సేపు. కాని దానివలన కలిగే తృప్తి ఎంతసేపు ఉంటుంది? ఎంతసేపయినా ఉంటుంది. వట్టి తృప్తి ఏం చేసుకోను? పులుసులో వేసుకోనా? ఎట్లాగూ డబ్బు ఇచ్చాను కాబట్టి ఒక అరకప్పు కాఫీ తాగి బయటపడ్డాడు. రోడ్డున నడుస్తున్నాడు. "ఛీ ఏం జీవితం ఇది? ఏ నెల కా నెల ఇంతే అవుతోంది" అని అనుకున్నాడు.

"అట్లా బేజారవుతావేం? ఈ కరువు రోజులలో అందరి పనీ అట్లానే ఉన్నది" అన్నాడు తనలోని రెండోవాడు.

"అందరి పనీ అట్లానే ఉన్నదనుకుని తృప్తి పడడం. అంతకన్న ఏమీ లేదు." అన్నాడు శేషు.

"నీకన్న ఇతర్లు సుఖపడుతున్నారని నువ్వు అనుకుంటున్నావు. నువ్వు గాని ఇతర్లలో ఒకరు అనుకునేప్పుడు నువ్వు సుఖపడుతున్నావని అనుకుంటారు" అన్నాడు తన రెండోవాడు.

"అట్లాగా! ఆ రామారావు చూడు. ఎవరినీ అప్పు అడగడు. పైగా తనే ఇతర్లకు వడ్డీ పాలికా సర్దుతూంటాడు."

"ఈ సంఘంలో రామారావులు ఎంతమంది ఉంటారు? అయినా రామారావు ఇబ్బంది పడడం లేదని నీకెట్లా తెలుసు?"

"ఇబ్బందిపడే మన మొహం చూసి ఎవరయినా ఇబ్బందిపడడం లేదని అనుకుంటారా? రామారావు ఎంత సరదాగా హాయిగా ఉంటాడు! అసలు అతనికి దిగులు అనేది ఉన్నవా అని."

"రామారావు జాయింటు కుటుంబంలో ఉంటున్నాడు. వాళ్ళనాన్న కొంచెం సంపాయిస్తున్నాడు. అయినా కొడుకును డబ్బు అడుగుతూనే ఉంటాడు."

"మరి వాళ్ళనాన్నకూ ఇచ్చి, ప్రతినెలా నాకో అక్కౌంటెంటుకో సుబ్బారావుకో అప్పు ఎట్లా ఇస్తున్నా డంటావ్?"

"ఇదే నీ తెలివి. అట్లా ఇతర్లకు ఇస్తూనే రామారావు ఈ వూళ్ళో నలుగురు కోమట్లతో స్నేహం చేసుకున్నాడు. తన అవసరానికి వందా రెండూ వాళ్ళదగ్గర తెస్తూంటాడు, నెమ్మదిగా తీరుస్తూంటాడు."

"అబ్బే, అట్లా అప్పు తెస్తున్నట్లు వాడి మొహంలో లేందే?"

"అది నీ బలహీనత. మనసులో ఉన్న ప్రతీది బయటకు కనిపించాలని ఎక్కడ ఉన్నదీ? పరిస్థితినిబట్టి సర్దుకుపోయే మనోనిబ్బరం ఉండాలి. అదుగో, ఇంటాయన ఎదురుగా వస్తున్నాడు. జాగ్రత్తగా మాట్లాడు. కిందటి నెలకూడా కొంత ఇవ్వాలి."

ఇంటాయన రాఘవయ్య చాలా తమాషా మనిషి. డబ్బు సంగతి కాక ఇంక ఏంకావాలన్నా చేసేటట్లే మాట్లాడతాడు. చెయ్యడం అంటూ వస్తే అది వేరే సంగతి.

"...ఆ...బ్యాంకినుంచి వస్తున్నారా?"

"అవునండీ ... పాడు వర్షం కురిసినట్టే కురిసి..."

"రోహిణీ ప్రవేశంలో వానవుందని సిద్ధాంతి గారు అననేఅన్నారండీ. ఇవాళ 21వ తారీఖు..."

"అవును. ఇదిగో పదిహేను రూపాయిలు. మిగిలింది ఇంటిదగ్గర ఇస్తాను."

"అబ్బే, ఇవ్వక ఎగవేస్తారా?... క్రిందటి నెల లోనూ ఓ పదిరూపాయిలు దిగపెట్టారు. చిన్నవాడు ఓ వందరూపాయలు అర్జంటుగా పంపమని రాశాడు. ఎక్కడున్నా చూసి పంపాలి. అంతకన్న వేరే..."

"సరే...ఇంటిదగ్గర కలుసుకుంటాను" అంటూ శేషు బయలుదేరాడు. మళ్ళీ తాను బయలుదేరిన చోటికే వచ్చాడు. అందుకనే భూమి గుండ్రంగా ఉన్న దన్నారు. 'దీని దుంపతెగా ఈ భూమి ఎందుకు గుండ్రంగా ఉన్నట్లు!"

"ఎక్కడికి ఇటు పోతున్నావు!" తన రెండోవాడు.

"ఇంటికి-ఇంక ఎక్కడికి పోతాను!"

"నీ తెలివి తెల్లవారినట్లే ఉన్నది. ఇంటికి పోయి ఏం చేస్తావు? తెల్లవారితే పాలవాడు, ఇంటాయన, చిల్లర కొట్టువాడు, ఇస్త్రీ చాకలి- వీళ్ళందరికీ ఏం చెప్తావు?"

"గుడ్డు అప్పు చెపుతాను."

"మంచివాడివి కదూ... అట్లాగే చేసేటట్లున్నావ్. నరసయ్య దగ్గరికి పోయి..."

"ఎందుకూ?"

'ఎందు కేమిటి? ఓ యాభయి రూపాయిలు అడిగి తీసుకో!"

"ఎటు తిరిగీ ఈనెలేగా వాణ్ని అప్పు అడగంది—"

'పోనీ రామ్మూర్తి దగ్గరకు పో."

"వాడు తగని మొహమాటస్తుడు. లేదంటే..."

"లేదంటే ఏం చెయ్యాలనే సంగతి ఇప్పుడాలోచించగల సత్తా నీకు లేదు. అది నీవంటి వాడికి చేతకాదు. నీవంటివాడు ఇతర్ల కుపయోగ పడాలి. ఇతర్ల సాయం పొందాలి."

"మనం ఏం సాయం చేస్తాం?"

"సాయం అంటే డబ్బు సాయమేనా? ఇంకా ఏమయినా చెయ్యవచ్చు."

ఇంకా నడుస్తూనే ఉన్నాడు. తన ఇల్లు దాటి పోయింది. రోడ్డువెంబడి అక్కడ ఓ కప్ప, ఇక్కడ ఓకప్ప బెకబెక లాడుతున్నాయి.

అధికారం తాగిన నాయకుల కళ్లల్లో లైట్లు వెలుగుతున్నాయి.

గట్టిగా గాలి పీలుస్తూ, గబగబా అడుగులు వేసుకుంటూ ఎవరూ లేని బెంచీకోసం వెదుకుతున్నాడు. ఎక్కడ చూసినా సుఖం, ఎవరి మొహాలు చూసినా ఎంతో తృప్తి కనిపిస్తుంది. ఇవన్నీ దేనివలన వస్తున్నాయి? డబ్బువలన...

"కాదు..." తనలోని రెండోవాడు.

"నీకూ నాకూ ఛీ ఛీ... నాతో మాట్లాడకు."

"నేను పలకక్కపోతే నీ పని హుళక్కి... సర్వానికీ కారణం ఏమిటి? అనే ప్రశ్న వదిలి నీ తెలివితేట లుపయోగించుకుని నీ సమస్యలను పరిష్కరించుకో..."

"అది చేతనయితే నీ చేత ఇంత చెప్పించుకోవడం దేనికి?"

"అదుగో, సుబ్బారావు వస్తున్నాడు. కాస్త హుషారుగా తిరుగు..."

"ఓ మిస్టర్ శేషూ..."

"ఏం ఇటు బయల్దేరావు?"

"నేను రోజూ ఇటే వస్తున్నాను. నువ్వే ఇవాళ కనుపించావు... కదా..."

"ఎక్కడికి?"

"న్యూ స్టోర్కి..."

"దేనికి?"

"ఏడిసినట్లే ఉంది. ముందు నడు, తరువాత చెప్తాను. ఇవాళ అందులో షో హో."

సుబ్బారావ్ ఎంత చలాకీ మనిషి! ఎన్ని ఇబ్బందులు వస్తున్నా, వచ్చినా ఇతర్లకుచెప్పడు. ఇతర్ల సాయం అడగడు. అడిగినట్లు తనకు తెలియదు.

సినిమాలో ... సుబ్బారావేమిటో చెప్తున్నాడు. తను కాసేపు అవునని, కాసేపు ఆహా అనీ, కాసేపు తెలిసీ తెలియకుండగా అనవసరంగానూ, అవసరంగానూ నవ్వి... కాలం వెళ్ళబుచ్చుతున్నాడు.

శేషు కళ్లు సినిమా చూస్తున్నాయి. తలలో మాత్రం సుశీల కనిపిస్తోంది. డబ్బేమీ లేకుండా ఇంటికి వెళితే సుశీల ఏమనుకుంటుందో? సుశీల అడగదు. ఆ ఇబ్బంది తన కెన్నడూ లేదు. కాని మిగతా నెలంతా గడవడం ఎలా? తెల్లవారితే ఇవ్వాల్సిన వాళ్ళందరికీ ఏమని చెప్పాలి? సుశీల తనను ఎన్నోసార్లు తన తండ్రిమీద దావా వెయ్యమన్నది... మళ్లీ సుశీలే "అబ్బే, అవేం పనులండీ" అంటుంది. తన జీవితంలో ఏనాడూ సుఖం అంటే ఏమో ఎరగడు. ఎందుకుగాను తను బ్రతుకుతున్నాడు? బ్రతకక్క చెయ్యడం ఏమిటి? చావాలి... బ్రతకడం ఒకకళ. ఒక పెద్దకళ. అది తనకు ఎందుకు చేతకాదు. తను బ్రతికే పద్ధతిమాత్రం కళ కాదా? కళా కాదు, గిళా కాదు — బ్రతుకే ఓ పెద్ద గండం. ఈ గండాన్నుంచి తప్పించుకోవాలి. ఎట్లా తప్పించుకోవడం? అది చేతయినయితే ఇంకా ఏం? తన ఆలోచనలే ఆలోచనలు. సుబ్బారావు స్త్రీలవంక చూస్తూ శేషుని ఆలోచించుకో నిచ్చాడు.

ఇంతలో ఇంటర్వెల్. "సోడా తీసుకురా" అన్నాడు సుబ్బారావు.

శేషు ఏదో మాత్ర నోట్లో వేసుకుని సోడా త్రాగాడు.

ఈ నాలుగు స్తంభాలాట తాను ఆడలేడు: తనకంటె సమర్థులయిన వాడు ఎట్లా ఆడుతున్నారో తనకు తెలియదు. ప్రతి వాడూ తన పని తాను చేసుకోవడమే కాని ఈ ఆటలో అలిసినవానికి కాస్త సాయం చేద్దామని అనుకోడు. అయినా ఎందుకు ఆలోచించాలి? శేషు కుర్చీలో నిర్జీవంగా పడివున్నాడు.

సుబ్బారావు సైగచేసిన స్త్రీ బయటికి వెళుతూ వాణ్ని పిలిచింది. వాడూ లేచి బయటికి పోయినాడు.

ఎవళ్ళగోడవ వాళ్లది, ఎవళ్ల ఆట వాళ్ళది. అంతేనా?